సాక్షి శ్రీకాకుళం

సోమవారం ¦ 4 ¦ నవంబర్ ¦ 2024



కైలాసాన.. కార్తీకాన

కార్తీక పూజకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. నేడు తొలి సోమవారం పూజలు జరగనున్నాయి.

- 8లో



శివభక్తులకు సువర్ణావకాశం

పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసు వేశారు. భక్తులు వినియోగించుకోవాలని కోరుతున్నారు.

- 8లో

రోస్టర్ పాయింట్లు సరిచేయండి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని నగరపాలక, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల పదోన్నతల సీనియారిటీ జాబితాలో రోస్టర్ పాయింట్లు తప్పుల తడకలుగా ఉన్నాయని, వెంటనే సరిచేయాలని ఆపస్ ఉపాధ్యాయ సంఘ జిల్లా కార్యదర్శి కె.సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలోని ఆపస్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి దువ్వూరి చలపతిరావు అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో సోమేశ్వరరావు మాట్లాడారు.

న్యూస్‌రీల్

మంత్రి ఇలాకాలో నిలిచిన ఆధార్ సేవలు



కోటబొమ్మాళి సచివాలయంలో పనిచేయని ఆధార్ కేంద్రం

కోటబొమ్మాళి: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత మండలమైన కోటబొమ్మాళి మండలంలో నాలుగు సచివాలయాల్లోని యంత్రాలు మరమ్మతుకు గురికావడంతో గత మూడు నెలలుగా ఆధార్ సేవలు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులతో పాటు సామాన్యులు ఇక్కట్లు పడుతున్నారు. కోటబొమ్మాళి, చీపుర్లపాడు, దంత, మహసాహెబ్‌పేట సచివాలయాల్లో యంత్రాలు మరమ్మతుకు గురికావడంతో ఆధార్ కేంద్రాల్లో సేవలునిలిచిపోయాయి. కొత్తగా విద్యార్థులకు అపార్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేస్తుండడంతో ఆధార్‌లో తప్పులు సరిచేసుకునేందుకు అంతా ఇబ్బందిపడుతున్నారు.ఆధార్ సేవల కోసం సుదూర ప్రాంతాల్లోని నరసన్నపేట, టెక్కలి, శ్రీకాకుళం పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది.

పలాస రైల్వేస్టేషన్‌లో 48 కేజీల గంజాయి పట్టివేత



పట్టుబడిన వారితో 48 కిలోల గంజాయిని చూపుతున్న సిఐ రవికుమార్

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ అనుమానాస్పద కదలికలతో జీఆర్పీ పోలీసులకు ముగ్గురు వ్యక్తులు 48 కేజీల గంజాయితో ఆదివారం దొరికిపోయారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పలాసలో ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన శివంకుమార్ చౌదరి, బదాయి మహతో, సాహెబ్‌కుమార్ చౌదరి అనే ముగ్గురు పలాస రైల్వే స్టేషన్ నుంచి గొండియా మీదుగా మహారాష్ట్ర ముంబై పట్టణానికి గంజాయి తరలించేందుకు ప్లాన్ వేశారు. పలాస రైల్వే స్టేషన్‌లో రైలులో ప్రయాణించేందుకు ప్లాట్‌ఫారంపై వేచి ఉండగా పోలీసులు వారి కదలికలు గమనించి వారిని ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 48 కిలోల గంజాయిని సీజ్ చేసి అనంతరం ముగ్గురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. కార్యక్రమంలో జీఆర్పీఎస్ పలాస సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే షరీఫ్, ఆర్‌హెచ్‌సీ మెట్ట సోమేశ్వరరావు, ఆర్‌పిసిఎస్ సంతోష్‌కుమార్, తులసి, దేవేంద్ర నాథ్, అనిత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా ఇసుక పోగులే



తమ్మినాయుడుపేటలో ఇసుక పోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలో జాతీయ రహదారికి ఆనుకుని తమ్మినాయుడుపేట ఇసుక రీచ్ ఉంది. దీనికి సమీపంలోనే తోటాడ, అక్కువరంలోనూ ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఈ రీచుల్లో రాత్రిళ్లు పొక్లెయినర్లతో ఇసుక తవ్వి పోగులు వేస్తున్నారు. అర్ధరాత్రి రెండు గంటలు సమయంలో విశాఖపట్నంకు తరలిస్తున్నారు. ప్రస్తుతం 40 ట్రాక్టర్ల ద్వారా ఇసుక పోగులు వేస్తున్నారు. ప్రస్తుతం స్థానిక పంచాయతీ, పక్క గ్రామాల ట్రాక్టర్ యజమానులు సిండికేట్‌గా మారారు. ఇక్కడ జాతీయ రహదారిపై నాగావళి నదిపై రెండు వంతెనలు ఉన్నాయి. తోటాడ సమీపంలో తాగునీటి పథకం ఇన్‌పిల్లర్లు ఉన్నాయి. ఇంతలా ఇసుక తవ్వితే వీటికి ప్రమాదం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గౌరీదేవి ఉత్సవాలపై ప్రభుత్వ ఆంక్షలు

కాశీబుగ్గ: పలాస మండలం చినంచల గ్రామంలో పురాతనంగా వస్తున్న గౌరీదేవి ఉత్సవాలను కాశీబుగ్గ పోలీసులు శనివారం రాత్రి పోలీసులు అడ్డుకున్నారు. స్టేజ్ ప్రోగ్రాంలో అశ్లీల నృత్యాలు వేస్తూ అశ్లీల పాటలు పాడుతున్నారని ఐదుగురు డాన్సర్లు, ఈవెంట్‌ని ఆర్గనైజ్ చేసిన చినంచల గ్రామస్తుడిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు కాశీబుగ్గ ఎస్‌ఐ మోహనరావు తెలిపారు. సంప్రదాయంగా వస్తున్న గౌరీదేవి ఉత్సవాలను అడ్డుకుని ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విడిదిళ్లు వసతులు నిల్



చెట్లపై విదేశీ పక్షులు

- విదేశీ పక్షుల విడిది కేంద్రాల్లో కానరాని మౌలిక సదుపాయాలు
- పిక్నిక్ సీజన్‌లకు మనుపే మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్న పర్యాటక ప్రేమికులు



తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రంలో నిర్లక్ష్యానికి గురైన పక్షుల సంరక్షణ షెడ్డు

టెక్కలి:

విదేశీ విహంగాలు జిల్లాలో సందడి చేస్తున్నాయి. వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే ఈ అతిథి విహంగాలను చూసేందుకు జిల్లా వాసులు కూడా ఉత్సాహం కనబరుస్తుంటారు. కానీ సందర్శకుల కోసం కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో అధికార యంత్రాంగం తీవ్రంగా విఫలమవుతోంది.

ఏటా సైబీరియా ప్రాంతం నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షులు కొన్ని వేల కిలోమీటర్ల దూరం దాటుకుని టెక్కలి మండలం తేలినీలాపురం గ్రామంలో గల విదేశీ పక్షుల విడిది కేంద్రానికి వస్తాయి. సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు ఇక్కడే విడిది చేస్తూ సంతానోత్పత్తి చేస్తుంటాయి. ఈ క్రమంలో నవంబర్ నెలాఖరు నుంచి ఆరంభం కానున్న పిక్నిక్ సీజన్‌లలో ఈ పక్షుల విన్యాసాలను తిలకించేందుకు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఎంతో మంది పర్యాటక ప్రియులు ఇక్కడకు చేరుకుని ఇక్కడే వన భోజనాలు చేస్తూ మానసిక ఆనందాన్ని పొందుతారు.

ఈ పక్షుల విడిది కేంద్రంలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. పక్షుల విడిది కేంద్రం ప్రధాన ద్వారం నుంచి రోడ్డు ఛిద్రంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెట్టు కొమ్మ సిమెంట్ బెంచీలపై పడిపోవడంతో అలాగే వదిలేశారు. వచ్చే పోయే పర్యాటకుల కోసం ఆరుబయట మంచినీటి సదుపాయం లేదు. మరో వైపు పక్షుల జీవిత చరిత్రను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన బోర్డులు రంగులు మారిపోయాయి. అంతే కాకుండా చిన్నారులు ఆడుకునే ఆట పరికరాలు మట్టిలో కూరుకుపోయి అధ్వానంగా మారాయి. దెబ్బతిన్న పక్షులు, వాటి గుడ్లు, పక్షి పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన షెడ్డు నిర్లక్ష్యానికి గురైంది. ఎంతో చరిత్ర కలిగిన తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రంలో ఇలా సమస్యలు విహరిస్తున్నప్పటికీ అటవీ శాఖాధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై పర్యాటక ప్రియులతో పాటు స్థానికులు మండిపడుతున్నారు. పిక్నిక్ సీజన్ ఆరంభం కాక మునుపే పర్యాటక ప్రియులను ఆకట్టుకునే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.



తేలినీలాపురంలో రంగులు వెలసిపోయిన పక్షుల జీవిత చరిత్రను తెలిపే బోర్డు

● రక్షణ కరువు



అనారోగ్యంతో ఎగరలేని సైబీరియా పక్షులు

పక్షుల ఆవాసాల వద్ద పడున్న పక్షుల కళేబరాలు

ఇచ్ఛాపురం రూరల్: మేఘాల పల్లకిలో వేల కిలోమీటర్ల దూరం నుంచి అలుపు సొలుపు లేకుండా విహరిస్తూ విదేశాల నుంచి వస్తున్న అరుదైన సైబీరియా పక్షులకు రక్షణ కరువైంది. మండలంలోని తేలుకుంచి గ్రామానికి ఏటా తొలకరి జల్లులు కురిసే సమయానికి సైబీరియా నుంచి వచ్చే ఓపెన్ బిల్ స్టార్క్స్ (నత్తగొట్టు కొంగలు, చిల్లుముక్కు కొంగలు) ఇక్కడ గుడ్లు పొదిగి పిల్లలతో సంక్రాంతి నాటికి మరల విదేశాలకు చేరుకుంటుంటాయి. అయితే ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ఎండ తీవ్రతకు చెట్లపై ఉండే పక్షి పిల్లలు నేలరాలుతూ మృతి చెందుతున్నాయి. పక్షుల కబేళాలు అక్కడక్కడ దిక్కూ, మొక్కు లేకుండా ఉండటంతో వీటి ఆవాసాల వద్దకు వెళ్లే పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు.

విదేశీ పక్షులను సంరక్షించాల్సిన అటవీ శాఖాధికారులు పక్షుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. ఏటా వన్యప్రాణుల వారోత్సవాలు సందర్భంగా తేలుకుంచిని సందర్శించే అటవీశాఖాధికారులు గ్రామస్తులతో చిన్నపాటి సమావేశం, ర్యాలీ నిర్వహించి రెండు మూడు ఫొటోలు తీసుకుంటూ వెళ్లిపోతూ ఉంటారే తప్పా, పక్షుల బాగోగులు పరిశీలించే అవకాశమే లేదని గ్రామస్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ నెలలో జిల్లా అటవీశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన యాళ్ల సంజయ్ అదే నెల 26న గ్రామాన్ని సందర్శించగా, జూన్ నెలలో తేలుకుంచి వచ్చిన పక్షులను నాలుగు నెలలు అనంతరం అక్టోబర్ 10న జాతీయ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు పేరిట గ్రామాన్ని అటవీశాఖ సిబ్బంది సందర్శించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామాన్ని సందర్శించలేదు.



మూలకు చేరిన పక్షుల సంరక్షణ కేంద్రం

మూలకు చేరిన పక్షుల సంరక్షణ కేంద్రం

తల్లి పక్షులకు, పిల్ల పక్షులకు ఏమైనా ఆపద కలిగినా, వ్యాధుల బారిన పడినా తక్షణమే సిబ్బంది వాటిని స్థానికంగా ఉండే 'పక్షుల సంరక్షణ కేంద్రం' వద్దకు తీసుకువెళ్లి అక్కడ ఉండే పశు సంవర్ధకశాఖ సిబ్బందితో వైద్యం చేయించాలి. అయితే తిత్లీ తుఫాన్ తర్వాత సంరక్షణ కేంద్రాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో ఆ కేంద్రం మూలకు చేరింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పక్షులను సంరక్షించే బాధ్యతలు తీసుకుని విదేశీ పక్షులను కాపాడాలంటూ పక్షుల ప్రేమికులు కోరుతున్నారు.

కక్ష సాధింపులను సహించబోము

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



స్టేషన్ బయట ఎస్ఐ నిహార్, సీఐ తిరుపతితో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వ నేతలు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించబోమని, పార్టీ కార్యకర్తలకు కాపాడుకుంటామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆదివారం వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌లో కొండపల్లికి చెందిన పార్టీ కార్యకర్త మద్దు జష్వంత్‌ను అరెస్టు చేయడంపై ఆయన మండిపడ్డారు. విషయం తెలుసుకుని పోలీస్ స్టేషన్‌లో బైఠాయించారు. తమ కార్యకర్తలను వదిలే వరకు ఇక్కడే ఉంటానని ఎస్ఐ నిహార్‌కు స్పష్టం చేసారు. ఈ నెల ఒకటో తేదీన నువ్వలరేవులో పింఛన్లు పంచుతుండగా బైనపల్లి దానమ్మ అనే మహిళ సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. ఈ పరిస్థితిని జష్వంత్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆగమేఘాల మీద స్పందించి జష్వంత్‌ను అదుపులోకి తీసుకోవడంతో మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కుపల్లిలో మృతుల పరామర్శలో ఉండగా విషయం తెలుసుకున్న అప్పలరాజు మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐతో మాట్లాడారు. అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని, నువ్వలరేవులో ఏం జరిగిందో మీకు తెలియదా అంటూ టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సూరాడ మోహనరావును పోలీస్‌స్టేషన్‌లోనే నిలదీశారు. వృద్ధురాలు సొమ్మసిల్లి పడిపోతే తానే ట్రీట్‌మెంట్ ఇప్పించానని, ఇవేవీ పరిశీలించకుండా పోస్టింగ్ చేసినంత మాత్రాన ఇంటికెళ్లి భయాందోళనకు గురి చేయడం ఏంటని ఎస్ఐ నిహార్, కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిని ప్రశ్నించారు. జష్వంత్‌ను 15 నిమిషాలు విచారణ చేసి వదిలేస్తామని హామీ ఇవ్వడంతో సీదిరి ఎస్ఐ చాంబర్ నుంచి బయటకు వచ్చారు. విచారణ అనంతరం జష్వంత్‌ను వదిలేశారు. ఈ విషయమై ఎస్ఐను వివరణ కోరగా వచ్చిన ఫిర్యాదు మేరకు మద్దు జష్వంత్‌ను విచారణకు పిలిచామని, కేసు నమోదు చేయలేదని తెలిపారు. సీదిరితో పాటు మండల ప్రత్యేక ఆహ్వానితుడు యు.ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, పలాస మాజీ ఎంపీపీ బి.హేమేశ్వరరావు, ఐరోతు హేమంత్‌రాజు, దువ్వాడ ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

అరసవల్లిలో కార్తీక సందడి



కార్తీక దీపాన్ని స్వామికి చూపిస్తున్న భక్తురాలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో కార్తీక మాసం తొలి ఆదివారం సందర్భంగా ప్రత్యేక సందడి కనిపించింది. వేకువజాము నుంచే భారీగా తరలివచ్చిన మహిళలు ఇంద్రపుష్కరిణిలో కార్తీక దీపాలను వదిలి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు.

శ్రీకాకుళం డివిజనల్ ఆర్డీవో సాయి ప్రత్యూష తొలిసారిగా ఆదిత్యుడిని దర్శించుకోగా ఆమెకు ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ. 2.67 లక్షలు, విరాళాల ద్వారా రూ.77,166, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.35 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు.

మమ అనిపించారు!

నెల్లూరు(టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 14, 17 విభాగాల్లో నెల్లూరులోని దర్గామిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమైన 68వ రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ -2024 పోటీలు ఆదివారం పేలవంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ముఖం చాటేశారు. జిల్లాలో అందుబాటులోనే ఉన్నా అటు వైపు రాలేదు. ఈ నేపథ్యంలో ఫెడరేషన్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ముఖ్యఅతిథులుగా మారి జాతీయ స్థాయికి ఎంపికైన బాలబాలికలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కాగా పోటీలను తిలకించేందుకు సైతం క్రీడాకారులు, విద్యార్థులు కరువయ్యారు.

వసతి గృహ విద్యార్థి మృతి

- ఆస్పత్రికి వచ్చేసరికే మృతి చెందాడన్న వైద్యులు
- నివేదిక కోరిన బాలల హక్కుల కమిషన్



శ్యామలరావు మృతదేహం



విలపిస్తున్న శ్యామలరావు కుటుంబ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని కాటవీధిలో ఉన్న వెనుకబడిన తరగతుల వసతిగృహం ఏడో తరగతి విద్యార్థి ఆదివారం ఆకస్మాత్తుగా మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం చిల్లపేట రాజాం గ్రామానికి చెందిన శ్యామలరావు (12) ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం అల్పాహారం తీసుకున్న తరువాత మంచినీరు తాగి బట్టలు ఉతికేందుకు రూమ్ నుంచి వెళ్తూ.. కళ్లు తిరిగి స్పృహ తప్పి పడిపోగా వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి వచ్చేసరికే మృతి చెందాడని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు తెలిపారు. శ్యామలరావును సహచర విద్యార్థులు ఆస్పత్రికి తీసుకొచ్చిన వెంటనే క్యాజువాలిటీ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారని చెప్పారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదికలో వెల్లడవుతాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శ్యామలరావు కుటుంబ సభ్యులు సర్వజన ఆస్పత్రికి చేరుకొని విలపించారు. వారి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

నివేదిక కోరిన బాలల హక్కుల కమిషన్

వసతిగృహ విద్యార్థి శ్యామలరావు మృతిపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అధికారులను నివేదిక కోరారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద విద్యార్థి మృతికి సంబంధించి సహచర విద్యార్థులు, వసతిగృహం సిబ్బందితో ఆయన ఆదివారం మాట్లాడారు. సంఘటనపై ఆరా తీశారు. విద్యార్థి మృతిపై వైద్యులతో మాట్లాఆరు. ఈ సంఘటనపై సమగ్ర నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట చైల్డ్‌లైన్ సిబ్బంది ఉన్నారు.

చిల్లపేటరాజాంలో విషాదం

రణస్థలం: విజయనగరం కాటవీధిలోని బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థి అనుమానాస్పద రీతిలో మృతి చెందడంతో స్వగ్రామం చిల్లపేటరాజంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మండలంలోని చిల్లపేటరాజాం గ్రామానికి చెందిన కొణతాల శ్యామలరావు(12) 7వ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. అకస్మాత్తుగా విద్యార్థి చనిపోయాడనే వార్త రావడంతో ఊరంతా ఉలిక్కిపడింది. శ్యామలరావు తల్లి రెండేళ్ల కిందటే చనిపోయారు. తండ్రి కొణతాల చినసత్యం పూసపాటిరేగ సమీపంలోని మైలాన్ పరిశ్రమలో రోజు కూలీ పని చేస్తూ స్వగ్రామంలోనే ఉంటున్నాడు. కుమార్తె స్నేహలతరెడ్డి ఆరో తరగతి పూసపాటిరేగ మండలంలోని గుంపాం అమ్మమ్మ వాళ్ల ఇంటి దగ్గర ఉంటూ చదువుకుంటోంది. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. విజయనగరంలో శవపంచనామా చేసి అనంతరం స్వగ్రామం చిల్లపేట రాజాంలో దహన సంస్కరణలు చేశారు.

ఉరిమే ఉత్సాహం



షాట్‌పుట్ విసురుతున్న ఎండీ ఆసియా (గుంటూరు)

- ప్రారంభమైన 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు
- రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన క్రీడాకారులు
- హోరాహోరీగా పోటీలు



హైజంప్‌లో తేజేశ్వరరెడ్డి (వైఎస్సార్ కడప) ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో 68వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్, ఉషూ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఖేలో ఇండియా పథకంలో భాగంగా శ్రీకాకుళం రూరల్ పరిధిలో ఉన్న పాత్రునివలసలో 33 ఎకరాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడులతో కలిసి ఆయన హాజరయ్యారు. అంతకుముందు వివిధ జిల్లాల క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సంఘ రాష్ట్ర నాయకుడు చౌదరి పురుషోత్తమనాయుడు, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్ రావు, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియంలో ఉషూ పోటీలను ఎమ్మెల్యే గొండు శంకర్ మధ్యాహ్నం ప్రారంభించారు.

ఉత్సాహంగా పోటీలు..

తొలిరోజు పోటీలన్నీ ఉత్సాహభరితంగా సాగాయి. 13 జిల్లాల నుంచి 1000 మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. వీరి వెంట కోచ్‌లు, మేనేజర్లు వచ్చారు. కేఆర్ స్టేడియం మైదానంలో అండర్-17 బాలబాలికలకు అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో పోటీలు జరగగా, సమీపంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అండర్-17,19 విభాగాల్లో బాలబాలికలకు ఉషూ పోటీలు జరిగాయి. ముఖ్యంగా అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. తొలిరోజు హార్డిల్స్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, జావెలిన్‌త్రో తదితర ఈవెంట్స్ నిర్వహించారు. గుంటూరు, నెల్లూరు, వైఎస్సార్ కడప, విశాఖ, ఉభయగోదావరి, శ్రీకాకుళం జిల్లాల క్రీడాకారులు సత్తాచాటుతున్నారు.



లాంగ్ జంప్‌లో పి.అనితాగ్లోరి విన్యాసం

రాణించిన జిల్లా క్రికెట్ క్రీడాకారులు



శిమ్మ సాత్విక్ 52 (నాటౌట్)



సెంచరీ సాధించిన ఎస్‌వీఎస్ వివేక్‌నందా

కాకుళం న్యూకాలనీ: జిల్లా బాలుర అండర్-14 క్రికెట్ జట్టు ఏసీఏ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో సమష్టిగా రాణిస్తోంది. వైఎస్సార్ కడప జిల్లా వేదికగా వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్-14 బాలుర మల్టీడేస్(త్రీడేస్ మ్యాచ్‌లు) క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జిల్లాతో జరిగిన కీలక మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ.. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కీలకమైన ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్ పాయింట్లను దక్కించుకుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ రెండు విభాగాల్లో సమష్టిగా రాణించారు. ఈ మ్యాచ్‌లో శ్రీకాకుళం జిల్లా క్రికెటర్లు ఎస్‌వీఎస్ వివేక్‌నందా 181 బంతుల్లో 108 (12 ఫోర్లు, ఒక సిక్సర్) పరుగుల సెంచరీతో ఆకట్టుకోగా, సిమ్మ సాత్విక్ 52(నాటౌట్) పరుగులతో రాణించారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు



గాయపడిన సాయికుమార్

కాశీబుగ్గ: మందస మండలం హరిపురంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాల పాలయ్యాడు. హరిపురం గ్రామానికి చెందిన పి.సాయికుమార్ ఆదివారం ఉదయం పెద్ద వీధిలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. కాగా, అనేక చోట్ల ప్రభుత్వ లైన్‌మేన్లు పనిచేయకుండా ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని పనులు చేయిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

26న రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ



మాట్లాడుతున్న వేదిక కమిటీ సభ్యులు

శ్రీకాకుళం: ఈ నెల 26న జరిగి రాజ్యాంగ దినోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం ఇలిసిపురంలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ ఈ నెల 26న మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు కె.వి.జగన్నాథరావు, నల్లి ధర్మారావు, మిస్క కృష్ణయ్య, పేడాడ కృష్ణారావు, డి.గణేష్, కోత ధర్మారావు, బి.బుద్ధుడు, వంకల మాధవరావు, లింగాల అప్పన్న, ఎం.ఫల్గుణరాజు, కూన రామం, చింతాడ కృష్ణారావు, రాకోటి రాంబాబు పాల్గొన్నారు.

ఏపీపీఆర్‌డీఈ సంఘ జిల్లా అధ్యక్షుడిగా మహంతి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర

అరసవల్లి: ఏపీ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజినీర్ల సంఘ జిల్లా అధ్యక్షుడిగా కేసీహెచ్ మహంతి ఎన్నికయ్యారు. స్థానిక జెడ్పీలో ఆదివారం నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఆయన ఏకంగా 13వ సారి ఎన్నికై రికార్డు సృష్టించారు. రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కె.రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో జిల్లా ఉపాధ్యక్షునిగా ఎం.పోలినాయుడు, కార్యదర్శిగా ఎస్‌వీపీ పోలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.రమేష్, కోశాధికారిగా బి.కృష్ణారావు, గౌరవ సలహాదారునిగా రిటైర్డ్ ఇంజినీర్ పల్లె నర్సింహులు ఎన్నికయ్యారు.

సత్యసాయి క్రికెట్ టోర్నీ విజేత పలాస



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ఫైనల్ పోటీలు నిర్వహించారు. పలాస జట్టు నరసన్నపేట జట్టుపై విజయం సాధించి కప్ కైవసం చేసుకుంది. విజేతలకు సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. సత్యసాయి జిల్లాలోని లేపాక్షి జవహర్ నవోదయ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అండర్–14 బాలబాలికల టీమ్ ఈవెంట్‌లో శ్రీకాకుళం 4వ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో పలాసకు చెందిన కె.కల్పక్ 7వ స్థానం, ఎచ్చెర్ల జీహెచ్‌స్కూల్‌కు చెందిన బి.యశ్వంత్ 8వ స్థానంలో నిలిచారు. వీరిద్దరు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన స్టాండ్‌బైలో చోటు దక్కించుకున్నారు. బాలికల విభాగంలో ఎచ్చెర్ల జీహెచ్ స్కూల్‌కు చెందిన బి.శృతి 9వ స్థానంలో నిలిచింది.

కైలాసాన కార్తీకాన శివరూపం!



కార్తీకం హిందువులకు ప్రీతిపాత్రమైన మాసం. ఈ నెల రోజులు అత్యంత పవిత్రమైన రోజులుగా భావిస్తారు. భక్తిశ్రద్ధలతో శివయ్యను వేడుకుంటే ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు సిద్ధిస్తాయని నమ్మకం. అందుకే ఈ మాసంలో మహిళలు వ్రతాలు, నోములు ఆచరిస్తారు. దీపారాధనకు కూడా అత్యంత ప్రాధాన్యమిస్తారు. ఈ నెల 4 నుంచి కార్తీక సోమవారాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన శివాలయాలైన శ్రీముఖలింగం దేవస్థానం, రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయం, శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- నేటి నుంచి కార్తీక సోమవారాలు ప్రారంభం
- ప్రధాన శివాలయాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు

ముక్తికి మార్గం.. శ్రీముఖలింగం

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగం. ఎక్కడైనా శివుడు లింగాకారంలో ఉంటాడు. ఇక్కడ మాత్రం ముఖం దాల్చి ఆవిర్భవించాడు. అందుకే ఈ క్షేత్రానికి శ్రీముఖలిగంమని, ఇక్కడ కొలువైన శివుడిని ముఖలింగేశ్వరుడని పిలుస్తారు. కాశిలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ జరిగే కార్తీక సోమవార పూజల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలలు నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తారు. ఈ ఏడాది కార్తీక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ ప్రభాకరరావు తెలిపారు.



శ్రీముఖలింగేశ్వరుని ప్రధాన ఆలయం

ఇలా వెళ్లాలి..



శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి శ్రీముఖలింగం సుమారు 50 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఈ క్షేత్రం చేరుకునేందుకు శ్రీకాకుళం నుంచి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి నరసన్నపేట నుంచి చల్లవానిపేట మీదుగా, మరొకటి కోమర్తి నుంచి ఉర్లాం మీదుగా శ్రీముఖలింగం చేరుకోవచ్చు. బస్సులు, కార్లు, ప్రైవేటు వాహనాల ద్వారా వెళ్లవచ్చు. రైల్లో వస్తే శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) స్టేషన్‌లో దిగాలి. అక్కడి నుంచి శ్రీకాకుళం వాహనాల ద్వారా చేరుకుని శ్రీముఖలింగం వెళ్లవచ్చు. ఆలయం ప్రతి రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ తెరిచి ఉంటుంది. అయితే భక్తులు, పర్యాటకులు ఉండేందుకు ఎటువంటి వసతి లేదు.

కలియుగ కైలాసం.. ఎండల మల్లన్న ఆలయం



ఎండల మల్లికార్జునస్వామి

టెక్కలి: ప్రపంచంలోనే అతి ఎత్తయిన స్వయంభూలింగం వెలిసిన ప్రాంతంగా టెక్కలి మండలం రావివలస గ్రామంలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయం ప్రఖ్యాతగాంచింది. కార్తీకమాసం సందర్భంగా ఈ నెల 4, 11, 18, 25వ తేదీలలో ప్రత్యేక పూజలను నిర్వహించడానికి ఆలయ అధికారులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు. జిల్లావాసులతో పాటు ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. మల్లన్నతో పాటు పక్కనే ఉన్న సీతకోనేరులో ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలతో పాటు కొండపై ఉన్న సీతమ్మ పాదాల పర్ణశాలకు హంగులు దిద్దారు. వీటితో పాటు కొండపై వెలసిన లలితాదేవి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇలా వెళ్లాలి..



ఆలయం వద్ద ఏర్పాట్లు

ఎండల మల్లికార్జునుడి ఆలయానికి చేరుకునేందుకు రోడ్డు, రైల్వే మార్గాలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నుంచి టెక్కలి చేరుకుని అక్కడి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి చేరుకునేందుకు బస్సులు, ఆటోల సదుపాయం ఉంది. రైల్వే విషయానికి వస్తే టెక్కలితో పాటు సమీపంలో సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నౌపడ రైల్వే స్టేషన్, 20 కిలోమీటర్ల దూరంలో పలాస రైల్వే స్టేషన్‌కు రైలులో చేరుకుని అక్కడి నుంచి బస్సులు, చిన్నపాటి వాహనాల్లో ఆలయానికి చేరుకోవచ్చు.

బలరామ ప్రతిష్ట..ఉమారుద్ర ఆలయ ప్రత్యేకత



ఉమారుద్ర కోటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో అతిపురాతన దేవాలయంగా గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధిగాంచింది. బలరాముడు ప్రతిష్ఠించిన దేవాలయంగా ప్రఖ్యాతి చెందిన ఈ ఆలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమి(పంచరత్నా) రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమావాస్య తదుపరివచ్చే త్రయోదశితో కూడిన చతుర్దశినాడు మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయి. నాలుగో సోమవారం స్వామివారికి 2016 రుద్రాక్షలతో పూజ చేసి అలంకరిస్తారు. ఉదయం 3 గంటల నుంచి ఆలయ ప్రవేశం, ప్రత్యేక పూజలు, భక్తుల రద్దీ బట్టి రుద్రాభిషేకాలు చేయిస్తారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాజరాజేశ్వరీ మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్రనామ పారాయణ ఉంటుందని అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, ఈఓ సర్వేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ శాఖ సహకారంతో నాగావళి నది ఒడ్డును పరిశుభ్రం చేయించినట్లు చెప్పారు.



ఆదివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సును ప్రారంభిస్తున్న ఒకటో డిపో మేనేజర్ అమరసింహుడు

శివభక్తులకు సువర్ణావకాశం

- పంచారామాలకు ప్రత్యేక బస్సులు
- భక్తులు సద్వినియోగం చేసుకోవాలి: డీపీటీవో



శ్రీకాకుళం అర్బన్: కార్తీకమాసం సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుపుతున్న పంచారామ క్షేత్రాల ప్రత్యేక బస్సులను భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మలు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆదివారం పంచారామాలకు బయలుదేరిన బస్సును ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల డీఎంలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి (అమరారామం), భీమవరం (భీమారామం), పాలకొల్లు (క్షీరారామం), ద్రాక్షారామం, సామర్లకోట (కుమారారామం) క్షేత్రాలు పంచారామాలుగా పేరు పొందాయన్నారు. కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలను దర్శించుకుంటే పుణ్యమని భక్తుల నమ్మకమని, అందుకే ఈ మాసంలో ఎక్కువమంది శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు ఆసక్తి చూపుతారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా రవాణా సంస్థ కార్తీక మాసంలో పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు వివరించారు. ఈ నెల 10, 17, 23వ తేదీల్లో పలాస, టెక్కలి, శ్రీకాకుళం డిపోల నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు బయలు దేరుతాయన్నారు. సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్, ఎక్స్ ప్రెస్ బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రత్యేక బస్సులకు రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందన్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బయలుదేరి సోమవారం ఐదు పుణ్య క్షేత్రాలను దర్శింపచేసి మంగళవారం ఉదయం 6 గంటలకు మరలా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేర్చుతామని వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, స్టేషన్ మేనేజర్ శ్రీను, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, యం.పి.రావు, కె.సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణ చార్జీలు ఇలా..

పంచారామాలను దర్శించుకునే భక్తులు ఒక్కొక్కరికి టికెట్ ఖరీదు సూపర్‌లగ్జరీ బస్సుకు రూ.2400, ఆల్ట్రాడీలక్స్ బస్సుకు రూ.2,350, ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.2000గా ప్రయాణ చార్జీగా నిర్ణయించారు. ముందస్తు టికెట్ కోసం ఆన్‌లైన్/అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం కూడా కల్పించారు. ఆన్‌లైన్ టికెట్‌ల కోసం www.apsrtc-online.in సంప్రదించవచ్చు. పూర్తి వివరాలకు 9959225608, 9959225609, 9959225610, 9959225611. 7382921647, 7382924758 నంబర్లను సంప్రదించవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



కార్తీకమాసంలో పంచారామాల సందర్శనం కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ నెల 10, 17, 24తేదీలలో ప్రత్యేక బస్సులు నడపనున్నాం. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎ.విజయ్‌కుమార్, డీపీటీవో

17న శ్రీముఖలింగంలో బాలియాత్ర



విద్యుత్ దీపాల వెలుగులో ముఖలింగేశ్వరాలయం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వంశధార నదీ తీరాన ఈ నెల 17న బాలియాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం భక్త బృందం కమిటీ శ్రీముఖలింగంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి మరుసటి రోజున వంశధార నదిలో దీపాలు విడిచి పెట్టే ఉత్సవం(బాలి యాత్ర) పక్కాగా నిర్వహించేందుకు ఆలయ అర్చకులు, భక్తులు, వైద్యులు డి.జీవితేశ్వరరావు, బి.,శ్రీరామ్, ఎస్.జగదీష్, హెచ్.వి.దొరలు ముందుకొచ్చారు. సుమారు ఐదు వేల సంవత్సరాలు క్రితం కళింగ రాజ్యంలో బాలి అనే దీవికి వెళ్లి దీపాలు విడిచిపెట్టేవారని, దీంతో వారి నౌకా వ్యాపారం విజయవంతంగా జరిగి మంచి లాభాలతో తిరిగి వచ్చేవారని చరిత్రలో ఉందన్నారు. కార్యక్రమంలో అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న అర్చకులు, భక్తబృందం

పక్కాగా ఏర్పాట్లు

జలుమూరు: మొదటి సోమవారం భక్తులు రద్దీ దృష్ట్యా క్యూలైన్లు, షామియాన్లు, చలువ పందిళ్లు, తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు.

అధికారుల గైర్హాజరుపై శాప్ చైర్మన్ ఆగ్రహం



స్టేడియం పనుల వివరాలు తెలుసుకుంటున్న శాప్ చైర్మన్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో క్రీడాకారులకు ప్రోత్సాహకాలు కరవయ్యాయని.. సీఎంతో చర్చించి క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. వారికి సమాచారం చేరవేశారా లేదా అని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావుని అడగగా తనకు తెలియదన్నారు. దీంతో మీరేం చేస్తున్నారంటూ ఆయనపై అసహనం వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులు లేకుండా ఇక్కడకు వచ్చి ఏంచేయాలో చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మండిపడ్డారు. కోడిరామ్మూర్తి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రతీ గదిని పరిశీలించారు. అనంతరం నరసన్నపేటలోని క్రీడావికాస కేంద్రాన్ని పరిశీలించారు.

కౌండిన్యకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కౌండిన్య

శ్రీకాకుళం కల్చరల్: ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన గురు దేబప్రసాద్ నృత్యోత్సవ-2024లో శ్రీకాకుళం నగరానికి చెందిన రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యుడు రామ కౌండిన్య ప్రముఖుల చేతుల మీదుగా గురు దేబప్రసాద్ నర్తన పురస్కారం అందుకున్నారు. రామ కౌండిన్య అర్ధనారీశ్వర స్తోత్రాన్ని నాట్యరూపంలో అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పలు కళా సంస్థలు, కళాభిమానులు కౌండిన్యను అభినందించారు.

శ్రీకాకుళం జిల్లాలో విమానాశ్రయం

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం: జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ విమానాశ్రయ ఏర్పాటునకు స్థల పరిశీలన జరుగుతోందని చెప్పారు. మూలపేట పోర్టు ఉండటంతో ఎగుమతులు, దిగుమతులు పెరుగుతాయని, విమానాశ్రయం కూడా ఉంటే జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో ల్యాండ్ బ్యాంక్‌లు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆ దిశగా కలెక్టర్‌ను కూడా ఆదేశించినట్లు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకొస్తే చిన్న, మధ్య, భారీ పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయిస్తామని చెప్పారు. పాత్రునివలస సమీపంలో స్పోర్ట్‌స్కూల్ ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే కరణం మల్లీశ్వరితో చర్చలు జరిపామని తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ స్టేడియం, శ్రీకాకుళం ఆమదాలవలస రోడ్డు, రింగురోడ్డు పనులపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.


కథా నిలయం పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

శ్రీకాకుళం కల్చరల్ : కథానిలయం పరిరక్షణకు అందరూ ముందుకు రావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళ సాహితీ, సాహితీ స్రవంతి సంస్థల సంయుక్త నిర్వహణలో ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కాళీపట్నం రామారావు(కా.రా.)మాస్టారు శత జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కథానిలయాం కథలను డిజిటలైజేషన్ చేసి ప్రపంచానికి పరిచయం చేయడం కారామాస్టారుకు మనమిచ్చే గొప్ప నివాళిగా పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.ఆర్.రజని మాట్లాడుతూ కారా మాస్టారు రచనలు ఎన్నటికీ ఆదర్శనీయమన్నారు. అనంతరం పూర్వ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, చీకటి దివాకర్, విశ్వసాహితీ అధ్యక్షుడు పొన్నాడ వరాహ నరసింహులు, రాజాం రచయితల వేదిక అధ్యక్షుడు గార రంగనాథం, సాహితీ స్రవంతి సంస్థ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, కారామాస్టారి కుమారులు కాళీపట్నం సుబ్బారావు, గరిమెళ్ల విజ్ఞాన సమితి అధ్యక్షులు వి.జి.కె.మూర్తి ప్రసంగించారు. కారా మాస్టారు రచనలు, కథలపై దుప్పల రవికుమార్, కంచరాన భుజంగరావు, మల్లిపురం జగదీష్, డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్, ఎ.మోహనరావు, బాడాన శ్యామలరావు, బాల సుధాకరమౌళి, చింతాడ తిరుమలరావు, పూజారి దివాకర్‌లు పత్ర సమర్పణ చేశారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు, భాషాభిమానులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెస్ పోటీలు



రాష్ట్రపోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని పీఎన్‌కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 10, 12, 14 విభాగాల్లో ఆదివారం జిల్లాస్థాయి స్కూల్ ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 82 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలకు ఏపీ చెస్ అసోసియేషన్ కార్యదర్శి, ఆలిండియా చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యులు సనపల భీమారావు, చౌదరి నారాయణమూర్తి(బాబ్జి), వేణుగోపాల్, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, ప్రసాద్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్

- వైఎస్సార్ సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్



నందిగాం: రుషికొండ ప్రభుత్వ భవనాలను చూపిస్తూ సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. ఆదివారం నందిగాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హామీలు, పాలన గాలికి వదిలేసి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి బ్యారేజీ స్థాయిని కుదించడం, వైజాగ్ స్టీల్ ప్లాంట్ మూయించే కుట్రలో భాగస్వామ్యం కలిగి ఉండటంతో రాష్ట్ర ప్రజలు ఈ విషయాలపై మాట్లాడకుండా ఉండేందుకు రుషికొండ భవనాలపై డైవర్షన్ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో అమరావతి పేరిట గ్రాఫిక్స్ కోసం, తాత్కాలిక నిర్మాణాలు కోసం ఎంత ఖర్చు పెట్టారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల వచ్చిన వరదలకు దాతలు రూ.500 కోట్లు ఇస్తే వాటిని కూడా దోచుకునేందుకు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. రుషికొండలో కట్టిన ప్రభుత్వ భవనాలు అద్భుతంగా ఉంటే మీకు వచ్చే ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ఆంధ్రా యూనివర్శిటీలో డిస్టెన్స్ కోర్సుల కొరకు డే & నైట్ జంక్షన్, శ్రీకాకుళంలో శ్రీ శివాని డిగ్రీ కళాశాల నందు సంప్రదించగలరు. ఫోన్: 99893 64332, 85009 60827. కోర్సులు: B.A., B.Com, B.Sc., B.Lisc., BBA, M.A, M.Com, M.Sc., MBA, MCA, M.Lisc. [V- 2709]

■ ఆంధ్రా యూనివర్సిటీ (AU) డిస్టెన్స్ కోర్సుల కొరకు HPN డిగ్రీ కాలేజ్, Opp: RTC కాంప్లెక్స్, శ్రీకాకుళం నందు ఈ క్రింది కోర్సుల కోసం సంప్రదించగలరు. డిగ్రీ: B.A., B.Com, B.Sc., పిజి: M.A, M.Com, M.Sc., MBA, MCA. Cont: 9492266648, 9296257998 [S- 1244768]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253906]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [M-12648]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP -40 వేలు, ఫ్రీ రూమ్+ భోజనం. HYD. Ph: 8317512135 [HA-98890]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.